క్లుప్తంగా


బస్సుల రద్దీతో ప్రయాణికుల అవస్థలు



కొయ్యలగూడెం బస్టాండ్‌లో ప్రయాణికులతో రద్దీగా ఉన్న బస్సు

కొయ్యలగూడెం: వరుస సెలవుల నేపథ్యంలో ప్రయాణికులు తమ గమ్యస్థానం చేరుకోవడానికి శుక్రవారం ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ముఖ్యంగా వరలక్ష్మీ వ్రతం కావడంతో మహిళలు అత్యధికంగా ప్రయాణాలు చేశారు. అయితే రద్దీకి సరిపడా బస్సులు లేకపోవడంతో బస్టాండ్ వద్ద వేచి చూడాల్సి వచ్చింది. మూడు రోజుల పాటు సెలవుల నేపథ్యంలో విద్యార్థులైన పిల్లలతో వెళ్లడానికి సకాలంలో బస్సులు లేకపోవడంతో ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది. కాగా కొన్ని బస్సుల్లో సుదూరంగా ప్రయాణించే వారిని మాత్రమే కండక్టర్లు ప్యాసింజర్ సర్వీసుల్లో ఎక్కించుకున్నారని దీని వలన మరింత రద్దీ ఏర్పడడానికి కారణం అయ్యిందని ప్రయాణికులు అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన బస్సులు అయితే కేవలం పట్టణాలకు వెళ్లే వారిని మాత్రమే ఎక్కించుకున్నారని మహిళలు వాపోయారు.

నేడు పర్వ దినం



జంగారెడ్డిగూడెం గోకుల తిరుమల పారిజాతగిరి

జంగారెడ్డిగూడెం: కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణా నక్షత్రం, శ్రావణ పౌర్ణమి, శనివారం ఒకే రోజు రావడం విశేషమని గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధానార్చకులు రవి కుమారాచార్యులు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ పర్వదినాన వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం శుభప్రదమన్నారు. స్వామి జన్మ నక్షత్రం, శ్రావణ పౌర్ణమి కలిసి రావడంతో భక్తులు స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.

నిలిచిన సత్యసాయి తాగునీరు



కొయ్యలగూడెంలో ట్యాంకర్ల ద్వారా తాగు నీటిని పట్టుకుంటున్న ప్రజలు

కొయ్యలగూడెం: సత్య సాయి తాగునీటి పథకం ద్వారా సరఫరా అయ్యే మంచినీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో పోలవరం, చింతలపూడి, గోపాలపురం నియోజకవర్గాలలోని దాదాపు 150 గ్రామాలకు చెందిన ప్రజలకు తీవ్ర దాహార్తి నెలకొంది. గత మూడు రోజుల నుంచి సత్యసాయి తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే ట్యాంకర్ల నీటిని దాహార్తికి వినియోగిస్తున్నారు. హుకుంపేటలోని సత్యసాయి తాగునీటి ప్రధాన పంపింగ్ హౌస్ ఉన్న ట్యాంకర్లలో మరమ్మత్తుల నేపథ్యం, క్లీనింగ్ నిమిత్తం సరఫరాను నిలిపివేసినట్లు తెలిసింది. అయితే దీనిపై సంబంధిత శాఖ అధికారులు ముందుస్తు సమాచారం ఇవ్వకుండా నిలిపివేయడంతో దాహార్తికి ప్రజలు అల్లలాడుతున్నారు. సత్యసాయి తాగునీటి సరఫరా వెంటనే పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా మహాలక్ష్మమ్మ సేవ



గ్రామ దేవతను ఊరేగిస్తున్న భక్తులు

కుక్కునూరు: శ్రావణమాసం, శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా కుక్కునూరు మండల కేంద్రంలో శుక్రవారం గ్రామదేవత మహాలక్ష్మమ్మను గ్రామస్తులు ఊరేగింపు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వీధికి డప్పు వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించగా, అడుగడుగునా భక్తులు అమ్మవారికి స్వాగతం పలికారు. కుక్కునూరు శ్రీ కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి ఆలయంలో నిర్వహించిన వరలక్ష్మి వ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంక్షేమ చట్టంపై ప్రచారం

దెందులూరు: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సంక్షేమ చట్టం 2007పై విస్తృత ప్రచారం కల్పించాలని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అన్ని శాఖల మండల గ్రామ స్థాయి ఉద్యోగులు సమిష్టిగా సంక్షేమ చట్టం పై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ల బాధ్యత కుటుంబ సభ్యులు తీసుకోవాలని అలా తీసుకోకుండా నిర్లక్ష్యం వహించి వారిని కొట్టిన తిట్టిన వేధించినా చర్యలు తీసుకుంటామన్నారు.

కొక్కెర వ్యాధి.. నివారణే మేలు

- వ్యాధి సోకితే నాటు కోళ్లు మృత్యువాత
- టీకాలు వేయించాలని సూచిస్తున్న పశు వైద్యులు



నాటుకోళ్లు

జంగారెడ్డిగూడెం: గ్రామీణ ప్రాంతాల్లో నాటు కోళ్ల పెంపకం అనాధిగా వస్తున్న సంప్రదాయం. మన పల్లెల్లో ప్రతి ఇంటికీ పదికి తక్కువ కాకుండా నాటు కోళ్లను పెరట్లో పెంచేవారు. ఈ కోళ్లు అదనపు ఉపాధిని కలిగిస్తూ ఉండేవి. ప్రస్తుతం మన పల్లెల్లో నాటు కోళ్ల పెంపకం అక్కడక్కడా కొనసాగుతోంది. ఇదే సమయంలో నాటు కోళ్ల ఫారాలు అభివృద్ధి చెందుతున్నాయి. వాటి ఆరోగ్యం గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన చాలా తక్కువ. సాధారణంగా నాటు కోళ్లకు సోకే వ్యాధి ఒకటి వస్తే, ఆ ప్రాంతంలో దాదాపు 80 నుంచి 90 శాతం నాటు కోళ్లు తుడిచి పెట్టుకుపోతాయి. అటువంటి వ్యాధుల్లో కొక్కెర వ్యాధి ఒకటి. ఈ వ్యాధిని గుర్తించి, టీకాలు వేయిస్తే వ్యాధిని నివారించొచ్చు. అలాగే నాటు కోళ్లల్లోనే కాకుండా లేయర్ కోళ్లల్లో కూడా కొక్కెర వ్యాధి వ్యాపిస్తుంది. వ్యాధి సోకితే నాటు కోళ్లు, లేయర్ కోళ్ల ఫారాల్లో అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాతకు గురవుతాయి.

కొక్కెర వ్యాధి వ్యాప్తి చెందే విధానం

కొక్కెర వ్యాధి పారా మిక్సో వైరస్ వలన కలుగుతుంది. ఈ వైరస్ గాలి ద్వారా సోకుతుంది. వ్యాధి సోకిన కోళ్లు వేసే రెట్టలు, వాటి కళ్ల నుంచి కారే నీరు, చొంగ వలన కూడా వ్యాప్తి చెందుతుంది. ముఖ్యంగా నాటు కోళ్లు, పిచ్చుకలు కూడా వైరస్‌ను రవాణా చేసే వాహకాలుగా పని చేస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో కోళ్లు ఊరంతా తిరుగుతూ ఉంటాయి. రాత్రి సమయంలో వీటికి ఒకే చోట వసతి కల్పిస్తుండటం వలన వ్యాధి సోకితే వారం రోజుల్లో ఆ ఇంటిలోని కోళ్లన్నింటికీ వ్యాధి వ్యాపిస్తుంది. దీంతో అధిక సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడతాయి. శరీరంలోని అన్ని అవయవాలపై వైరస్ ప్రభావం చూపుతుంది. శ్వాస వ్యవస్థ, జీర్ణ వ్యవస్థ, నాడీ వ్యవస్థ ప్రధానంగా ప్రభావితం అవుతాయి. వైరస్ ఇంక్యూబేషన్ కాలం 5 నుంచి 7 రోజుల మధ్య ఉండి, 10 నుంచి 14 రోజుల్లో వ్యాధి బహిర్గతమవుతుంది.

వ్యాధి లక్షణాలు

- ఆకుపచ్చ నీళ్ల విరేచనాలు
- మేత, నీరు తీసుకోవు.
- దగ్గు, గురక, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది
- కళ్లు, ముక్కు నుంచి నీరు కారటం
- జుట్టు నల్లబడి, నరాల బలహీనతతో వణుకుతాయి
- రెక్కలు వాలిపోతాయి. కాళ్లు, మెడ వంకర్లు పోతాయి.
- పక్షవాతంతో కోళ్లు చనిపోతాయి.

నివారణ ఇలా..

ఈ వ్యాధి సీజన్ మారే సమయంలో ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది. అంటే వేసవి నుంచి వర్షాకాలం, వర్షాకాలం నుంచి శీతాకాలం ఇలా కాలాలు మారే సమయంలో ఉధృతంగా ఉంటుంది. వ్యాధి సోకిన తరువాత చేసే చికిత్స కన్నా, నివారణే ముఖ్యం. వ్యాధి నివారణకు టీకాలు వేస్తారు. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో వ్యాధి నివారణ టీకాలు వేయించడం ఉత్తమం. నివారణ టీకాలు ఒక పద్ధతి ప్రకారం చేస్తారు. మొదటగా వారం లోపు పిల్లలకు కొక్కెర తెగులు టీకాను ముక్కులో గాని, కంట్లో గాని వేయాలి. తిరిగి అదే మందును 8 వారాల తరువాత వేసి, ఆ తరువాత ప్రతి సంవత్సరం కొనసాగిస్తే వ్యాధిని పూర్తిగా నిర్మూలించవచ్చు.

"టీకాలు తప్పనిసరిగా వేయించాలి



కేవలం 50 పైసుల వెచ్చించి మార్కెట్‌లో లభించే టీకాలు వేయిస్తే కోళ్లను కొక్కెర వ్యాధి నుంచి కాపాడవచ్చు. పశు వైద్యశాలలో కూడా కొక్కెర వ్యాధి టీకాలు ఉచితంగా అందిస్తారు. సాధారణంగా ప్రతి సంవత్సరం పశువైద్య సిబ్బంది గ్రామాల్లో కొక్కెర వ్యాధి టీకాలు ఉచితంగా వేస్తారు. అయితే టీకాలను సామూహికంగా ఊళ్లో ఉన్న కోళ్లన్నింటికీ వేయించడం మేలు. డ్వాక్రా గ్రూపులు, మహిళా సంఘాలు ఈ కార్యక్రమాలను చేపట్టవచ్చు. ఈ విధంగా నాటు కోళ్లకు కొక్కెర వ్యాధి నివారణ టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని అదుపులో ఉంచుకోవచ్చు.

– బీఆర్ శ్రీనివాసన్, పశువైద్యాధికారి

నూతన కమిటీలతో వైఎస్సార్ సీపీ బలోపేతం



లింగపాలెం: 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నేతలు



కామవరపుకోట: నూతనంగా ఎన్నికైన వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ సభ్యులు

లింగపాలెం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి నూతనంగా ఏర్పడిన కమిటీల కార్యవర్గం కృషి చేయాలని మండల వైసీపీ అధ్యక్షులు అన్నపనేని శాంతరావు అన్నారు. మండలంలో పార్టీ గ్రామ కమిటీలు వేసే కార్యక్రమాలతో పాటు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం చురుగ్గా సాగుతుందన్నారు. కూటమి నాయకుల మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని శాంతరావు నాయకులు, కార్యకర్తలకు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నరసన్నపాలెం గ్రామంలో ఎంపీపీ ముసునూరి వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ముసునూరి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద గ్రామ పార్టీ కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుక్కపల్లి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శులుగా కొత్తా రామ్మోహనరావు, తాతిన ఫణేంద్ర, ముసునూరి కృష్ణారావు, రాయపాటి ధనుంజరావు, కార్యదర్శులుగా నంద్యాల రాములు, జొన్నకూటి నాగరాజు, కల్లేపల్లి రాంబాబు, లోచర్ల శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు చీదరాల ప్రసాద్, యలమంచిలి సత్యనారాయణ, కుక్కపల్లి బసవయ్య, ముసునూరి అర్జున, వంకలపాటి వెంకటేశ్వరరావు, ఎం.శేషగిరి, మోరంపూడి సత్యనారాయణ, కె.శేశవరావు, బొల్లిన వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

భోగోలు గ్రామ కమిటీ ఎన్నిక

మండలంలోని భోగోలు గ్రామ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఇనుగంటి చిన రంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యవర్గం వివరాలు ప్రధాన కార్యదర్శులుగా బడుగు మునుస్వామి, పాతనూరి మోహన్‌రావు, ఆచంట నాగేశ్వరరావు, తాళ్లూరు సురేష్, కార్యదర్శులుగా పంది కృష్ణమూర్తి, పలగాని చెన్నారావు, మద్దిపాటి శ్రీనివాసరావు, దాసరి బాలకృష్ణలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

రంగాపురం గ్రామ కమిటీ ఇలా..

మండలంలోని రంగాపురం గ్రామ కమిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా ఓబిళ్లనేని శేషగిరిరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వైఎస్సార్ సీపీ సినియర్ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు రెడ్డిన శ్రీను ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఓబిళ్లనేని శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శులుగా గుళ్లపూడి సత్యనారాయణ, కూరాకుల శ్రీనివాసరావు, గరికిపూడి శ్రీనివాసరావు, అంగడాల రాటాలు, కార్యదర్శులుగా మాదాసి లక్ష్మీన్నారాయణ, బేతు నవీన్, కాట్రు ఆదాము, కాటు ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

తాడిచర్ల వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ నియామకం

కామవరపుకోట: మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ వైఎస్సార్ సీపీ కొత్త కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. కామవరపుకోట సొసైటీ మాజీ అధ్యక్షుడు సాయిన కనకరాజు, టౌన్ కన్వీనర్ నానాది సాగర్, మేడంకి విజయరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు రాయంకుల సత్యనారాయణ కొత్త కమిటీని ప్రకటించారు. వైఎస్సార్ సీపీ తాడిచర్ల గ్రామ కమిటీ అధ్యక్షుడిగా మిడతా మారయ్య, ప్రధాన కార్యదర్శులుగా గుడెల్లి జోజి, గుల్లా మంగరాజు, తలపాడల శ్రీను, జోనుబోయిన రాంబాబు, కార్యదర్శులుగా నల్లమోతుల సత్యనారాయణ, పోతునూరి మాణిక్యాలరావు, చింతపల్లి సత్యనారాయణ, దాసరి రామకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వారిని నాయకులు అభినందించారు.

సౌభాగ్యాలను కలిగించు వరలక్ష్మి

వాడవాడలా ఘనంగా వరలక్ష్మీ వ్రతాలు



కొయ్యలగూడెం: కరెన్సీ నోట్ల అలంకరణలో కనకదుర్గమ్మ



బుట్టాయగూడెం: గోమాతకు పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు దంపతులు



జంగారెడ్డిగూడెం: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

బుట్టాయగూడెం: సిరి సంపదలు, భోగ భాగ్యాలు కలిగించే వరలక్ష్మీ వ్రతం పూజలు ఏజెన్సీ ప్రాంతంలోని పలు గ్రామాల్లో మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. లక్ష్మీదేవి అమ్మవారు వరాలను, అనుగ్రహాలు, ధనం, శ్రేయస్సు, సంతానం, ఆరోగ్యం, జ్ఞానం, ధైర్యం, విజయాలను ఇవ్వాలని కోరుతూ అత్యంత భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలను చేశారు. మండలంలోని దుద్దుకూరులో మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు వరలక్ష్మీ పూజలతో పాటు గోమాతకు పూజలు చేశారు.

కొయ్యలగూడెంలో..

కొయ్యలగూడెం: వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ప్రజలు శుక్రవారం భక్తి శ్రద్ధలతో సౌభాగ్యాలను అందించాలని వరలక్ష్మీదేవికి ఘనంగా పూజలు నిర్వహించారు. వై.జంక్షన్ ఆలయంలోని కనకదుర్గమ్మను నోట్ల కరెన్సీతో అలంకరించి ధనలక్ష్మి రూపంలో భక్తులు కొలిచారు. బయ్యనగూడెం, కొయ్యలగూడెం, కన్నాపురం, గవరవరం గ్రామాలలోని కనకదుర్గమ్మ ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. కొయ్యలగూడెం గ్రామ దేవత చింతాలమ్మ ఆలయం వద్ద లలితా సహస్రనామ కోటి పారాయణలో మహిళలు వంద మందికి పైగా పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం: వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో ఆచరించారు. జంగారెడ్డిగూడెం గ్రామదేవత గంగానమ్మ, జెడ్పీ హైస్కూల్ కనకదుర్గమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, లలితాదేవి ఆలయంతో పాటు పలు దేవాలయాల్లోని అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. ముత్యాలమ్మ అమ్మవారి ఆలయంలో ఆలయం ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ ఆదిత్య మిశ్రా ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి లఘున్యాస పూర్వకంగా పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ దంపతుల పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీనూకాలమ్మ స్వర్ణ వర్ణ పూర్ణ కవచాలంకరణలో దివ్య దర్శనం ఇచ్చారు. ఆలయ శాశ్వత చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, మేకా సింహాద్రి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నట్లు తెలిపారు. నూకాలమ్మ అమ్మ వారి రజిత వస్త్ర తయారీకి మంత్రపూడి శ్రీనివాసరావు, రేవతి దంపతులు 5తులాల వెండిని, చీకట్ల రమేష్ సాయిదివ్య దంపతులు 5 తులాల వెండిని సమర్పించారని తెలిపారు. చిట్లూరి సుబ్బరావు, శ్రీ నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం ప్రసాద వితరణ చేశారు.

టి.నరసాపురంలో..

టి.నరసాపురం: శ్రావణమాసం శుక్రవారం వరలక్ష్మీ వ్రతం సందర్భంగా ఇంటింటా పండగ వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకట లాడాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మహిళలు పసుపు కుంకుమలను సమర్పించారు. ఇళ్లలో అమ్మవారి బొమ్మలను నెలకొల్పి ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా భక్తులు ద్వారకాతిరుమల పాదయాత్రగా వెళ్లారు. మార్గమధ్యంలో టి.నరసాపురంలోని కాశీ విశ్వేశ్వర స్వామిని దర్శించుకున్నారు.

శాకంబరిగా క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి ఉపాలయమై, క్షేత్ర దేవతగా విరాజిల్లుతోన్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు ఫల, కూరగాయల అలంకారంలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. వరలక్ష్మి వ్రతాన్ని పురస్కరించుకుని అమ్మవారు ఈ విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా ఆలయాన్ని సైతం శోభాయమానంగా తీర్చిదిద్దారు. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు మహిళా భక్తులతో ఆలయం సందడిగా మారింది.

అధిక రక్తపోటుపై అవగాహన



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణకు వైద్యశాఖ సూచనలు, సలహాలు పాటించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వినయ్ అన్నారు. దెందులూరులో ఆయుష్మాన్ ఆరోగ్యం వద్ద అధిక రక్తపోటుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ప్రతి రోజూ వ్యాయామం చేయాలన్నారు. ఆహారంలో ఉప్పు, నూనె వాడకాన్ని తగ్గించాలని సూచించారు. పని ఒత్తిడి తగ్గించుకోవడం ద్వారా అధిక రక్తపోటును నివారించవచ్చు అన్నారు. అనారోగ్యం లక్షణాలు గుర్తిస్తే నిర్లక్షంయం చేయొద్దన్నారు.

అచ్చమ్మ పేరంటాలమ్మకు చీర, సారె

దెందులూరు: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గాలాయగూడెం శ్రీఅచ్చమ్మ పేరంటాలమ్మకు శుక్రవారం 108 మంది ముత్తైదువులు, గ్రామస్తులతో చీర, సారెతో పాటు 108 రకాల పిండి వంటలు అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు సుమంత్ శర్మ గారి ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టుచీరలతో ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుత అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి ఆలయ కమిటీ సభ్యులు భక్తులు గ్రామ పొలిమేర నుంచి పూర్ణకుంభాలతో మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు చేశారు. గాలాయగూడెంతో పాటు సమీప గ్రామాల్లో భక్తులు శ్రీ అచ్చమ్మ పేరంటాలు తల్లి అమ్మవారికిచీరసారె సమర్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ఆవరణలో వచ్చిన భక్తులకు పులిహోర ప్రసాదంతో పాటు సారే వితరణ చేశారు.

వైద్యులు అందుబాటులో లేక రోగుల ఇక్కట్లు



ఆసుపత్రి నుంచి వెనుతిరిగి వెళ్లిపోతున్న రోగి శ్రీనివాసరావు

కామవరపుకోట: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. శుక్రవారం యానాదుల కాలనికి చెందిన తుపాకుల శ్రీనివాసరావు అనే వ్యక్తి అనారోగ్య కారణంగా బంధువులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వైద్య సేవల నిమిత్తం తీసుకెళ్లగా అక్కడ ఆసుపత్రి సిబ్బంది ఎవరూ లేకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారు. అక్కడ ఉన్న ఒక వ్యక్తిని సిబ్బంది ఏరని ప్రశ్నించగా, ప్రస్తుతం ఆస్పత్రి సిబ్బంది ఎవరూ లేరని, మీకు అవసరం అయితే రేపు రావాలని సమాధానమివ్వడంతో చేసేదేమీ లేక రోగి శ్రీనివాసరావు వెనుతిరిగి వెళ్లిపోయాడు. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి నెలకొందని, అత్యవసర పరిస్థితిలో ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, అధికారులు స్పందించి ఆసుపత్రిలో అన్ని వేళలా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్య తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఆదివాసీలు ఐకమత్యంగా ఉండాలి

కుక్కునూరు: రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఆదివాసీలందరూ ఐక్యమవ్వాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదివాసీ దినోత్సవ నవోత్సవాల్లో భాగంగా రెడ్డిగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన చైతన్య సదస్సులో సంజీవరావు మాట్లాడారు. ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు అద్దం పట్టేలా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని కోరారు. ఆదివాసీ దినోత్సవానికి ప్రతీ గ్రామం నుంచి అధిక సంఖ్యలో ఆదివాసీలు హాజరై జాతి ఐక్యతను చాటి చెప్పాలని సూచించారు. శనివారం జరిగే వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి పైదా పరమేశ్వరరావు, వేణు గోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా గోర్ బంజారా తీజ్ పండుగ



గోర్ బంజారా తీజ్ పండుగ నిర్వహిస్తున్న భక్తులు

టి.నరసాపురం: బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో గోర్ బంజారా జాతి పెళ్లి కాని ఆడ పిల్లలు తొమ్మిది రోజుల పాటు ఘనంగా చేసుకునే తీజ్ పండుగను టి.నర్సాపురం మండలం కృష్ణాపురం గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ ప్రధాన కార్యదర్శి భూక్యా వేణు గోపాల్ మాట్లాడుతూ గ్రామాలు పాడి పంటలు, సిరి సంపదలతో అభివృద్ధి చెందాలని కోరుకుంటూ భక్తి శ్రద్ధలతో మేరామా, తులజా, సీతలా, హింగ్లా మొదలగు ఏడుగురు భవానీలను పూజిస్తూ గోర్ బంజారా ఆడ పిల్లలు చేసుకునే పండుగ తీజ్ అన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మూడు శ్రీనివాస్ నాయక్, సంఘ కోశాధికారి ధరావతు రవి నాయక్, దేశావత్ వెంకట్, భూక్యా సత్యం, భూక్యా ధనలక్ష్మి, జరభల కృష్ణలీల, భూక్యా సునీల్, లావుడియా సంధ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కొయ్యలగూడెం: పేకాట స్థావరంపై దాడులు చేసి, ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.40 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ శుక్రవారం పేర్కొన్నారు. అంకాలగూడెం శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం అందడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలు, కోడి పందేలు, పేకాట పందాలు పేకాట నిర్వహిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే డయల్ 112కు గాని లేదా కొయ్యలగూడెం ఎస్సై 9440796666కు గాని సమాచారం అందించాలని ఆయన కోరారు.

10న ఆలయ అభివృద్ధి కమిటీ ఏర్పాటు



సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ ప్రముఖులు

జంగారెడ్డిగూడెం: బుట్టాయగూడెం రోడ్డులోని శ్రీసీతారామస్వామి ఆలయ పునర్నిర్మాణం చేపట్టనున్నట్లు పట్టణ ప్రముఖులు మహంకాళి రాజా, ఆలయ ఈవో కలగర శ్రీనివాస్, ప్రధానార్చకులు శ్రీనివాసుల సతీష్ ఆచార్యులు తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం నిమిత్తం కార్యక్రమాల పర్యవేక్షణకు అభివృద్ధి కమిటీని ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇందుకు గాను ఈ నెల 10వ తేదీన శ్రీ సీతారామ కాలక్షేప కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ప్రజలు, రామ భక్తులు, హిందులు పాల్గొనాలని కోరారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంప్

జంగారెడ్డిగూడెం: ఈ నెల 10వ తేదీన జీబీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిట్స్, పెరాలసిస్, బీపీ, షుగర్ మెడికల్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక, గ్రీన్‌ల్యాండ్ సేవా సమితి సభ్యులు తెలిపారు. ఆదివారం ఉదయం 7 నుంచి 10 గంటల వరకు మెడికల్ క్యాంపు నిర్వహించి, నాలుగు నెలలకు సరిపడా మందులు ఇస్తారు. కార్యక్రమంలో సేవలు పొందాలనుకునే రోగులు ఒక రోజు ముందు చేయించుకున్న బ్లడ్ టెస్ట్, బీపీ టెస్ట్ రిపోర్టులు, గతంలో వాడిన లేదా ప్రస్తుతం వాడుతున్న మందుల స్ట్రిప్స్, డాక్టర్ రిపోర్టులు తప్పనిసరి అని తెలిపారు.